క్లుప్తంగా

జనాభా పెరుగుదలతో సవాళ్లు



మాట్లాడుతున్న ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు

తిరుపతి ఎడ్యుకేషన్: అధిక జనాభా పెరుగుదలతో పలు సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్ బాబు తెలిపారు. ఆ కళాశాలలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న జనాభాతో సహజ వనరుల కొరత, మౌలిక సదుపాయాల కల్పనలో ఇక్కట్లు, పర్యావరణంపై చూపే ప్రభావం తదితర పలు సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. పెరుగుతున్న జనాభాను నియంత్రించేందుకు అవగాహన కార్యక్రమాలను విస్తారంగా నిర్వహించాలన్నారు. భౌగోళిక శాస్త్ర అధ్యాపకురాలు డి.అనురాధ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక జనాభా, యువత కలిగిన భారతదేశంలో విద్య, ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందిస్తే యువభారత సమగ్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సీఎల్.చెన్నారెడ్డి, డాక్టర్ వి.ప్రసన్నలక్ష్మీ, వై.మహేశ్వరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు




కేంద్ర మంత్రి బేచారం మన్న, మాజీ క్రికెటర్ శ్రీశాంత్

తిరుమల: శ్రీవారిని గురువారం ఎంపీ గొల్ల బాబురావు, కేంద్ర మంత్రి బేచారం మన్న, తెలంగాణ ఎమ్మెల్సీ కాలేరు వెంకటేష్, మాజీ క్రికెటర్ శ్రీశాంత్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూప్రసాదాలతో సత్కరించారు.

మృతుని కుంటుంబానికి ఆర్థిక సాయం



మృతుని భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఈడిగ గౌడ్ సంఘం సభ్యులు

పాకాల: చిగరపల్లికి చెందిన యువరాజులు గౌడ్(65) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ సందర్భంగా గురువారం ఈడిగ గౌడ్ సంఘం సభ్యులు మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే దహనక్రియలకు మృతుని భార్య యశోదమ్మకు రూ.7,500 ఆర్థిక సాయం అందజేశారు. ఈడిగ గౌడ్ సంఘం మండల ప్రెసిడెంట్ విజయ్‌కుమార్ గౌడ్, కార్యదర్శి శ్రీనివాసులు గౌడ్, సభ్యులు మురళిగౌడ్, మనోహర్‌గౌడ్, రెడ్డెప్పగౌడ్, శివగౌడ్, మధుగౌడ్, దాముగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న తిరుపతి రూరల్ సీఐ తమీమ్ అహ్మద్

తిరుపతి రూరల్: సీఐ తమీమ్ అహ్మద్ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీల్లో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థలు ఏమైనా ఉన్నాయా...అంటూ ఆటోలు, ప్రయాణికుల వాహనాలను క్షుణ్ణంగా పరిక్షించారు. లైసెన్స్ లేనివారు, త్రిబుల్ రైడింగ్ చేస్తున్న ద్విచక్ర వాహనదారులకు, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్న వారికి మొదటిసారి కౌన్సెలింగ్ ఇచ్చారు. మితిమీరిన వేగంతో పోతున్న బైక్ రైడర్స్‌కు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ తమీమ్ అహ్మద్ మాట్లాడుతూ మత్తు పదార్థ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అందులో భాగంగానే వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, లేకుంటే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు, పోలీసులు పాల్గొన్నారు.

తక్కువ ధరలకే నిత్యావసరాలు

చంద్రగిరి: అధిక ధరలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్కువ ధరలకే నిత్యావసరాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. గురువారం వారు చంద్రగిరి బస్టాండ్ సమీపంలోని ఓ సూపర్ మార్కెట్‌లో తనిఖీలను చేపట్టారు. అనంతరం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరలకు బియ్యం, కంది పప్పు విక్రయ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ సూర్యసాయి పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’కు తూట్లు

- ఆధార్‌కార్డు పేరుతో అనవసర రాద్ధాంతం చేస్తూ జీఓ విడుదల
- తనదైన శైలిలో వంచన చేసేందుకు సిద్ధమవుతున్న బాబు సర్కార్
- ఎంత మంది పిల్లలు ఉన్నా ఒకరికే వర్తించేలా యత్నం
- ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్న ప్రైవేటు సంస్థలు
- తల్లికి వందనం కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు



తిరుపతి సిటీ: నూతన ప్రభుత్వం ఏర్పడి పట్టుమని నెల రోజులు కూడా కాకముందే ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా తుంగలో తొక్కేస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రధానంగా ప్రస్తావించిన తల్లికి వందనం పథకంపై నిబంధనలు పెడుతూ తనదైన శైలిలో వంచన చేసేలా బుధవారం బాబు సర్కార్ జీఓ విడుదల చేసింది. ఆర్థిక ఇబ్బందులతో బడిఈడు పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకం అమ్మ ఒడి. ఆయన మానసపుత్రికగా పిలువబడే అమ్మ ఒడి పథకాన్ని అధికార దాహంతో ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు పేరు మార్చి తల్లికి వందనంగా నామకరణం చేశారు. ఓ కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున తల్లి ఖాతాలో జమ చేస్తామని మహిళలను తప్పుదోవ పట్టించి అధికారం చేజిక్కించుకున్నారు.

తల్లికి వందనం ఒక్కరికేనా?

చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్ హామీలలో అమలుకు వీలుకాని పథకాలను ప్రవేశపెట్టి అధికారంలో వచ్చాక నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. తల్లికి వందనం పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ పథకాన్ని వర్తింపజేస్తామని జీఓలో స్పష్టం చేయకుండా ఒక్క తల్లికి మాత్రమే రూ.15 వేలు ఇవ్వనున్నట్లు తాజాగా జీఓలో ప్రకటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న తల్లులకే పథకం వర్తించేలా పేర్కొంటున్నారు. పిల్లలకు ఆధార్‌కార్డు తప్పనిసరి అని, లేకుంటే మరో 10 రకాల గుర్తింపు కార్డులలో ప్రస్తుతానికి ఏదో ఒకటి సమర్పించాలని గందరగోళం సృష్టిస్తూ జీఓ విడుదల చేశారు. వాస్తవానికి పుట్టిన రెండేళ్లలోపు తల్లిదండ్రులు పిల్లలకు ఆధార్ కార్డు తీసుకుని రేషన్ కార్డులో పేరు నమోదు చేసుకుని ఈకేవైసీ చేయించుకుంటారు. ఆధార్ కార్డు లేకుంటే ఆ విద్యార్థికి ఒకటో తరగతిలో అడ్మిషన్ పొందేందుకు వెసులుబాటు ఉండదు. తల్లికి వందనం పథకం కాలయాపన కోసం మరోమారు సీఎం చంద్రబాబు తల్లులను మోసం చేసేందుకు చూస్తున్నారంటూ విద్యార్థి తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు.

తిరుపతి రూరల్: ‘చంద్రబాబు మాట ఇచ్చారు. చదువుకునే ప్రతి బిడ్డకు సంవత్సరానికి రూ.15 వేలు అమ్మ అకౌంట్లోనే వేస్తారు. ‘తల్లికి వందనం’ పథకం అమలు చేస్తున్నారు. ఇందులో ఒక తల్లికి ఒక బిడ్డ ఉంటే ఒక్కరికి, ఇద్దరు ఉంటే ఇద్దరికి, ముగ్గురు ఉంటే ముగ్గురికి, నలుగురు ఉంటే నలుగురు బిడ్డలకు ఇస్తారు. అంటే నలుగురు బిడ్డలు బడికి వెళ్తుంటే ఒక తల్లికి రూ.60 వేలు ప్రతి ఏటా చంద్రబాబు ఇస్తారు’ అంటూ ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రగిరి మండలం ఐతేపల్లి వద్ద జరిగిన యువగళం ఎన్నికల సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటించారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకల్లో కీలకమైన తల్లికి వందనం పథకాన్ని ప్రతి బిడ్డకు రూ.15 వేలు అంటూ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు.

అధికారంలోకి వచ్చాక అమ్మలకు మొండిచెయ్యి

ఎన్నికల్లో టీడీపీకి తల్లికి వందనం పథకం ఒక బూస్ట్‌లా పని చేసింది. గత ప్రభుత్వం ఇచ్చినట్లు ప్రభుత్వం, ప్రైవేటు బడులతో సంబంధం లేకుండా అందరికీ తల్లికి వందనం అందిస్తామని ఊదరగొట్టారు. అయితే బుధవారం తాజాగా విడుదల చేసిన జీఓ నెంబర్ 29లో బిడ్డలతో సంబంధం లేకుండా తల్లికి మాత్రమే కేవలం రూ.15 వేలు అందిస్తామంటూ ప్రకటించడంతో అమ్మలు అవాక్కవుతున్నారు. చంద్రబాబు మోసంపై మండిపడుతున్నారు. ఎన్నికల హామీలను చంద్రబాబు అమలు చేయరనే గత అనుభవాలను గుర్తు చేసుకుంటున్నారు.

నియోజకవర్గంలో 13,475 మంది అర్హులు

చంద్రగిరి నియోజకవర్గంలోని తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల పరిధిలో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు 13,475 మంది ఉన్నారు. వారు అందరికీ తల్లికి వందనం అమలు చేయాల్సి ఉంటుంది.

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాం



తల్లికి వందనం పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల ఒత్తిడి పెరిగింది. మాకు ఇద్దరు కుమారులు. తిరుపతి నారాయణ స్కూల్‌లో నాలుగు, 7వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం ఇద్దరు పిల్లలకు వస్తే రూ.30 వేలు వస్తుంది. ఫీజులు చెల్లించేందుకు ఎదురుచూస్తున్నాం. సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నాం.

- పద్మావతి, కొర్లగుంట, తిరుపతి

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. అప్పుడే ప్రజల్లో ఆయన పాలనపై న మ్మకం కలుగుతుంది. మా పిల్లలు చైతన్య విద్యాసంస్థలలో ఇంటర్ ఒక రు, 10వ తరగతి ఒకరు చదువుతు న్నారు. తల్లికి వందనం ఇద్దరి పిల్లలకు వస్తుందని ఎంతో ఆశతో ఉన్నాం. పాఠశాలల యాజమాన్యాలు ఇప్పటికే ఫీజులు చెల్లించమని ఒత్తిడి తెస్తున్నాయి. త్వరగా తల్లికి వందనం అందితే ఫీజుల కట్టేందుకు ఎంతో ఉపయోగక రంగా ఉంటుంది. గత ప్రభుత్వంలో నాలుగు సంవత్సరా లు అమ్మ ఒడి సమయానికి నేరుగా నా ఖాతాలో జమ అయింది. అదే విధంగా చంద్రబాబు పథకాలకు ఎటువంటి నిబంధనలు పెట్టకుండా అర్హులందరికీ అందిస్తారని కోరుకుంటున్నా.

- లక్ష్మీ సుజాత, ఎమ్మార్ పల్లి, తిరుపతి

విద్యుత్ సరఫరాకు అంతరాయం

చంద్రగిరి: విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యల పరిష్కారం నిమిత్తం శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏడీఈ శేషాద్రి రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు చంద్రగిరి మండల పరిధిలోని నరసింగాపురం, నాగయ్యగారి పల్లి, రామిరెడ్డి పల్లి, కూచివారిపల్లి, బుచ్చినాయుడుపల్లి, శంకరయ్యగారి పల్లి, పుల్లయ్యగారి పల్లి, బందార్లపల్లి, కొటాల, ఎ.రంగంపేట, నారావారి పల్లి, కందులవారి పల్లి, శేషాపురం, చిన్న రామాపురం, భీమవరం, యల్లంపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లుగా తెలిపారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు. ప్రతి నెలా రెండో శనివారం విద్యుత్ మరమ్మతులు చేపడుతామని, అయితే శ్రీనివాస మంగాపురం ఆలయంలో టీటీడీ వారు పార్వేట ఉత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారమే మరమ్మతులు చేపడుతున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

శ్రీనివాస ఐఏఎస్ స్టడీ సర్కిల్ ప్రారంభం

తిరుపతి కల్చరల్: బాలాజీ కాలనీలోని ఆదిత్య టవర్స్‌కి ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీశ్రీనివాస ఐఏఎస్ స్టడీ సర్కిల్‌ను గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల పోటీ పరీక్షలకు అనుభవజ్ఞులు, నిపుణులైన వారితో శ్రీశ్రీనివాస స్టడీ సర్కిల్ నాణ్యమైన శిక్షణ అందిస్తోందన్నారు. డీఎస్సీ, టెట్ శిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించి, హాజరైన విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ మెటీరియల్ అందజేశారు. నిర్వాహకుడు ఎస్.శ్రీనివాసులు, సైకాలజీ ఫ్యాకల్టీ కె.హరిబాబు, శివనాథ్, విష్ణువర్ధన్, గాయత్రి, మహ్మద్ రఫీ, నవీన్, అమర్‌నాథ్‌రెడ్డి, అశ్విని పాల్గొన్నారు.

బహిరంగ వేలం

పాకాల: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు సమర్పించే తలనీలాలు, కొబ్బరి చిప్పలు, ద్విచక్ర వాహనాల పార్కింగ్, పాదరక్షలు భద్రపరుచు హక్కులకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ యువరాణి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఈఓ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ నుంచి ఆలయంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేపు (శనివారం) ఆలయ ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు వేలం నిర్వహిస్తారని తెలిపారు.

తాత్కాలిక కుటుంబ నియంత్రణతో ఆరోగ్యం



ఏరియా ఆసుపత్రి నుంచి ర్యాలీ

చంద్రగిరి: తాత్కాలిక కుటుంబ నియంత్రణ ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని చంద్రగిరి పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ కుసుమ అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ చిన్న కుటుంబంతో జీవించడం ద్వారా ఆర్థిక సమస్యలు లేకుండా సంతోషంగా జీవించవచ్చునని తెలిపారు. బాల్యవివాహాలు చేయడం ద్వారా బాలికలు చిన్న వయస్సులోనే అనారోగ్యం బారిన పడతారన్నారు. కుటుంబం సంక్షేమంగా ఉంటే దేశం సౌభాగ్యంగా ఉంటుందని తెలిపారు. అనంతరం నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈఓ ఈశ్వరయ్య, ఎంపీహెచ్‌ఎస్ వెంకటేశ్వర రావు, వాసుదేవ, శ్యామల, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్లోరినేషన్ తప్పనిసరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈ రమణ




నూతన పద్ధతిలో క్లోరినేషన్

భాకరాపేట: మంచి నీటిని సరఫరా చేయడంలో క్లోరినేషన్ తప్పనిసరి అని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమణ పేర్కొన్నారు. గురువారం చిన్నగొట్టిగల్లులోని జగనన్న సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నీటిని పరిశీలించి, పంపిణీ చేయాలన్నారు. అలాగే క్లోరినేషన్ నూతన పద్ధతిలో చేయడం ద్వారా త్వరగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి, ఏఈ సిద్ధారెడ్డి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాన్ టీచింగ్ అసోసియేషన్ ఎన్నికలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు గురువారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా జి.శ్రీధర్, సెక్రటరీగా ఎన్.సుబ్రమణ్యం ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి షఫీ మాట్లాడుతూ అధ్యక్ష పదవికి ముగ్గురు బరిలో నిలవగా జి.శ్రీధర్ 217 ఓట్లు సాధించి విజయం సాధించారని తెలిపారు. అదేవిధంగా కార్యదర్శి పదవికి సైతం ముగ్గురు బరిలో నిలవగా ఎన్.సుబ్రమణ్యం 215 ఓట్లు సాధించి విజయం సాధించారన్నారు. 32 మంది



జి.శ్రీధర్



ఎన్.సుబ్రమణ్యం

ఈసీ మెంబర్లకు 15మంది విజయం సాధించగా, మరో 17 మంది ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు.



అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లను పక్కనే ఉన్న శ్రీహరికాలనీ రోడ్డుపై నిలిపి ఉంచుతున్నారు. అసలే ఇరుకు వీధి పైగా ఈ ట్రాక్టర్లను కూడా పార్క్ చేస్తుండడంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. స్థానికుల కార్లు, ద్విచక్ర వాహనాలు తిరగడానికి ఇక్కట్లు తప్పడం లేదు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

నెత్తకుప్పం విద్యార్థుల ప్రతిభ



కుసుమ



ఇందు

రామచంద్రాపురం: మండలంలోని నెత్తకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. గత సంవత్సరం పదో తరగతి చదివిన ఇద్దరు విద్యార్థులు కుసుమ, ఇందు వైఎస్ఆర్ కడప జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం తులసి కుమారి తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీరు గత సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో మండలంలో మొదటి, ద్వితీయ స్థానాలు సాధించారని తెలిపారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక వ్వడం హర్షణీయమన్నారు.

రెటీనా ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రెటీనా పరీక్షల నిర్వహిస్తున్న డాక్టర్ సుధారాణి

తిరుపతి తుడా: రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని శ్రీసాయి సుధా కంటి ఆసుపత్రిలో గురువారం రెటీనా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి ఎండీ డాక్టర్ సుధారాణి వైద్యుల బృందం 50 మందికి రెటీనా వైద్య పరీక్షలను నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి వెనుక భాగంలో ఉండే సున్నితమైన పొర రెటీనా కాంతిని గ్రహించి మెదడుకు ప్రతిబింబాలను పంపిస్తుందన్నారు. మధుమేహం ఉన్న వారిలో డయాబెటిక్ రెటినోపతి అనే కంటి వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. అప్పుడప్పుడు షుగర్ పేషెంట్లు రెటీనా పరీక్షలు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. హిమబిందు, సునీత, ద్వారక, మహేష్, నరేంద్ర, పురుషోత్తం పాల్గొన్నారు.

డాక్టర్ వంశీకృష్ణకు యంగ్ పీడియాట్రిషియన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వంశీకృష్ణ

తిరుపతి తుడా: తిరుపతి అంకుర ఆసుపత్రికి చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఏ.వంశీకృష్ణ యంగ్ పీడియాట్రిషియన్ అవార్డును అందుకున్నారు. ఏషియా టుడే మీడియా సంస్థ యంగ్ పీడియాట్రిషియన్ ఆఫ్ ది ఇయర్ ఆంధ్రప్రదేశ్ అవార్డుతోపాటు ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డును గురువారం బెంగళూరులో నిర్వహించిన సదస్సులో అందజేశారు. అంకుర మాతా, శిశు సంరక్షణ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ అందిస్తున్న వైద్య సేవలను గుర్తించిన వారు ఈ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణను పలువురు అభినందించారు.

అవగాహనతో క్యాన్సర్ దూరం



ముంగిలిపట్టులో స్విమ్స్ శిబిరం

చంద్రగిరి: ప్రజలు అవగాహన పెంచుకోవడం ద్వారా క్యాన్సర్ వ్యాధిని తరిమికొట్టవచ్చునని కొటాల పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక అన్నారు. గురువారం మండల పరిధిలోని కొటాల, ముంగిలిపట్టు గ్రామాల్లో నిర్వహించిన క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో గురువారం టీటీడీ స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సు క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్విమ్స్ పింక్ బస్సు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో బ్రెస్ట్, ఓరల్, సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడంతో తరచూ రోగాల బారిన పడుతున్నారన్నారు. 45 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళా తరచూ క్యాన్సర్‌పై స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించుకోవడం ద్వారా వాటిని తగిన సమయంలో గుర్తించి, నివారించవచ్చునన్నారు. ఆరోగ్య సిబ్బంది, 104 సిబ్బంది, స్విమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నగర భద్రతకు పెద్దపీట



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: తిరుపతి నగర భద్రత, పర్యవేక్షణ కోసం ప్రత్యేక నిఘా వ్యవస్థ అందుబాటులోకి రానుందని స్మార్ట్ సిటీ ఎండీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ అన్నారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం స్మార్ట్ సిటీ భాగస్వామ్య ప్రతినిధులు, పోలీస్ అధికారులు, ఇంజినీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓల్డ్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. నగర భద్రతకు సంబంధించి అత్యధిక సీసీ కెమెరా వ్యవస్థను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించామన్నారు. ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని ఆధునిక సిగ్నల్ వ్యవస్థను తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాల పనితీరు గురించి ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్‌వారు, ఐ ట్రిపుల్ సి కాంట్రాక్టింగ్ ఏజెన్సీ వారు వివరాలను తెలియపరిచారు. ఏఎస్పీ కులశేఖర్, ట్రాఫిక్ డీఎస్పీ రమణ కుమార్, టెలికాం జీఎం వెంకోబారావు, ఏపీఏస్పీడీసీఎల్ ఎస్సీ సురేంద్ర నాయుడు, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ మోహన్, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, మేనేజర్ చిట్టిబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై కల్యాణ వెంకన్న



హనుమంతునిపై స్వామివారు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాల్లో రెండో రోజైన గురువారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 10 నుండి 11 గంటల వరకు కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవర్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం రాత్రి 7 గంటల నుండి హనుమంత వాహనంపై స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. వైభవోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి గరుడ వాహనసేవ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వాహన సేవలో పాల్గొన్న అధికారులు, భక్తులు